క్లుప్తంగా

మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాతసేవ, అభిషేకాలు, బండారార్చన, అమ్మవార్లకు కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సంతర్పణ తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి వచ్చారు. వారికి ఆలయ కమిటీ నిర్వహకులు అన్నదానం చేశారు.

ముగిసిన దస్తగిరిస్వామి ఉరుసు



స్వామివారి అశ్వాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

దేవనకొండ: మండలంలోని నేలతలమరి గ్రామంలో దస్తగిరిస్వామి ఉరుసు ఆదివారం ముగిసింది. స్వామివారి అశ్వాన్ని గ్రామంలో ఊరేగించారు. ప్రజలు అశ్వం వద్దకు వచ్చి అశ్వాన్ని తాకి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



తురువగల్లులో ప్రతిష్ఠించిన పెద్దమ్మవ్వ, సుంకులమ్మవ్వ విగ్రహాలు

ఆస్పరి: మండలంలోని తంగరడోణ మజరా గ్రామం తురువగల్లులో ఆదివారం పెద్దమ్మవ్వ, సుంకులమ్మవ్వ విగ్రహాల ప్రతిష్ఠాపన జరిగింది. కొత్తగా నిర్మించిన ఆలయాల్లో పెద్దమ్మవ్వ, సుంకులమ్మవ్వకు యంత్ర స్థాపన, అభిషేకం, హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ఆడపడుచులు అమ్మవార్లకు ఒడి బియ్యం సమర్పించారు.

సబ్సిడీ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం బీసీ, ఈబీసీ, కమ్మ, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. మొత్తం 50 యూనిట్లకు 423 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. హొళగుంద ఎస్‌బీఐ, హెబ్బటం ఆర్జీబీ బ్యాంక్ అధికారులు దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తుగ్గలి : 13 ఏళ్ల క్రితం వేసిన మండలంలోని అశోకుని శిలాశాసనాలకు వెళ్లే రోడ్డు పూర్తి శిథిలావస్థకు చేరి రాకపోకలకు అంతరాయం కలిగేది. దీంతో సీసీరోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు రూ.90 లక్షలు మంజూరవడంతో రోడ్డు నిర్మించేందుకు కాంట్రాక్టర్ ఆదివారం ఎర్త్‌వర్క్ పనులు ప్రారంభించారు.

విద్యుత్ వేళల్లో మార్పులు

కృష్ణగిరి: మండలంలోని లక్కసాగరం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల రైతులకు సోమవారం త్రీఫేస్ సరఫరాను ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు సరఫరా చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్స్ పని చేయనుండటంతోపాటు ఆర్‌డీఎస్ వర్క్ కూడా ఉండటంతో మార్పులు చేశామని, రైతులు గుర్తించాలని కోరారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

కృష్ణగిరి: గ్రామాల పరిశుభ్రతకు అందరూ సహకరించాలని ఈఓఆర్డీ చిన్న లచ్చప్ప కోరారు. కృష్ణగిరిలో ఆదివారం ఆయన ఇంటింటికీ తిరిగి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్తలను వేసేందుకు బుట్టలు అందజేశామన్నారు. రోజూ ఇంట్లోని చెత్తను వేర్వేరుగా ఉంచితే గ్రీన్ అంబాసిడర్ ద్వారా సేకరిస్తామని తెలిపారు. కార్యదర్శి సుంకన్న ఉన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

మద్దికెర : ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బెంగళూరు రామచంద్రమిషన్ సభ్యులు అశ్వర్థనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రంలో ధ్యానంపై అవగాహన కల్పించారు. అనవసరమైన ఆలోచనలతో శాంతిని కోల్పోతున్నారని, దీంతో అనారోగ్యం పాలవుతున్నారన్నారు. నిర్వాహకులు పక్కీరప్ప పాల్గొన్నారు.

భక్తులకు అండ..బోడబండ

- 26నుంచి ఉత్సవాలు ప్రారంభం

తుగ్గలి : కోర్కెలు తీర్చి భక్తులకు కొండంత అండగా నిలిచే తిమ్మగురుడు, పక్కీరప్పస్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. మండలంలోని ఉప్పర్లపల్లి సమీపంలోని బోడబండ పుణ్యక్షేత్రంలో ఏటా మహాశివరాత్రి నుంచి రెండు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఈ పుణ్యక్షేత్రం 150 ఏళ్ల క్రితమే వెలసిందని పెద్దలు చెబుతారు. ప్రతి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వాములను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. క్షేత్రంలో నిద్ర చేస్తే కోర్కెలు తీరి మంచి జరగడంతో పాటు, రోగాలు నయమవుతాయని భక్తుల విశ్వాసం. మహాశివరాత్రి మరుసటి రోజు తిమ్మగురుడు, పక్కీరప్పస్వాముల రథోత్సవాలను వేర్వేరుగా నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 26నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 26న జాగరణ, అదే రోజు ఉప్పర్లపల్లి నుంచి మేళతాళాలతో పక్కీరప్ప, యల్లప్ప, తిమ్మగురుడు స్వామి ఉత్సవమూర్తులను ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో పూజారులు కృష్ణయ్యఆచారి, భీమన్నలు ఊరేగింపుగా బోడబండ కొండకు చేరుస్తారు. 27 శివపార్వతుల కల్యాణం, సాయంత్రం తిమ్మగురుడు, పక్కీరప్ప స్వాముల రథోత్సవాలు నిర్వహించనున్నారు.



ప్రత్యేక అలంకరణలో తిమ్మగురుస్వామి



పక్కీరప్పస్వామి

మహిమాన్వితం 'బుగ్గ సంగమేశ్వరం'

మద్దికెర : మద్దికెరకు 3 కిలో మీటర్ల దూరంలో నున్న అనంతపురం జిల్లాలోని బుగ్గ సంగమేశ్వర స్వామి దేవాలయం శ్రీకృష్ణదేవరాయలుతో నిర్మితమై ప్రకృతి ఒడిలో అలరారుతూ సుందరమైన ప్రాచీన శివక్షేత్రంలో మహా శివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు విశేషపూజలు జరుగుతాయి. మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

26వ తేదీ తెల్లవారు జామున పంచామృతాభిషేకం, కలశస్థాపన, నవగ్రహపూజ, అన్నదానం, రాత్రి 12 గంటలకు పార్వతీదేవీ, శ్రీబుగ్గసంగమేశ్వర స్వాముల కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 27న ఉదయం శ్రీవారికి అభిషేకం, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం, అన్నదానం. సాయంత్రం 4 గంటలకు రథోత్సవం ఉంటుంది.



బుగ్గ సంగమేశ్వరం దేవాలయం

ఆలయ చరిత్ర..

పూర్వం ఒక ఋషి తన గురువు ఆజ్ఞ మేరకు లోక కల్యాణార్థమై అకుంఠిత దీక్షతో ద్వాదశ జ్యోతిర్లింగాల యాత్రనారంభించి చివరగా శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వారిని దర్శించి యాత్రలో భాగంగా బుగ్గ సంగమేశ్వరానికి వచ్చి ఇక్కడ కాశీ క్షేత్రంలో లాగా ప్రవహిస్తున్న ఉత్తర వాహిని గంగా నదిలో స్నాన మాచరించి బయటికి రాగానే ఒక తేజోవంతంగా.. విరాజిల్లుతున్న శివలింగం కనిపించింది. భక్తి పారవశ్యంతో ఇక్కడ వెలసిన శివ లింగమునకు అభిషేకాలు, పూజలు చేసి వచ్చి ధ్యానంలో నిమగ్నమై తనగురువు గారిని ధ్యానించాడు. ధ్యానంలో బ్రాహ్మణునికి తన గురువు కనిపించి శిష్యా ఈప్రపంచమున పరమశివుని మించిన పరతత్వం మరొకటి లేదు. కావున ఎంతో శక్తివంతమైన ఈప్రదేశమున (బుగ్గలోనే) తపమాచరంపుము. నీకు ఇక్కడ పరమశాంతి లభించి నీజన్మ ధన్యమవుతుందని గురువుగారు ఆదేశించడంతో ఆ బ్రాహ్మణుడు బుగ్గలో ఉద్భవలింగానికి ఆలయం నిర్మించి రావి, జివ్వి చెట్టు నాటించారు. ఎదురుగా బసవన్నగుడిని నిర్మించారు. ఇదంతా 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో జరిగినట్లు ఇక్కడి శాసనాల ద్వారాల తెలుస్తున్నది. ఇక్కడ నిరంతరం రెండు నీటి బుగ్గలు కలిసి కాశీ లోలాగా ఉత్తరం నుంచి దక్షిణం వైపు ప్రవహిస్తుంటాయి.



స్వామి వారి మూలవిరాట్

మహాశివరాత్రికి ముస్తాబు..



రామతీర్థంలో వెలసిన రామలింగేశ్వర స్వామి



పంచలింగేశ్వర ఆలయం ఆవరణలో శివపార్వతుల విగ్రహాలు

ఆస్పరి: ఈనెల 26వ తేదీన నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు మండలంలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఆస్పరిలోని మూల ఈశ్వర స్వామి, పక్కీరప్ప తాత, రామతీర్థంలోని రామలింగేశ్వరస్వామి, బిణిగేరిలో శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి, కై రుప్పలలో వీరభద్రస్వామి, మహాలింగప్ప ఆలయల్లో మహా శివరాత్రి సందర్భంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించునున్నారు. 26న రామతీర్థంలో రామలింగేశ్వర స్వామి ప్రభోత్సవం, 27న ఆస్పరిలో పక్కీరప్ప తాత రథోత్సవం నిర్వహించునునారు. అదే రోజు బిణిగేరిలో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర క్షేత్రంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, గొరవయ్యల పాలసేవ, జ్యోతి వెలిగించడం తదితర కార్యక్రమాలు నిర్వహించునున్నారు.

అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు..

శివరాత్రి రాత్రి మహోత్సవాలు సందర్భంగా పంచలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఈనెల 28వ తేదీన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహించునున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసనాయన ఆదివారం తెలిపారు. గెలుపొందిన వారికి వరుసగా రూ. 50వేలు,రూ.40వేలు, రూ.30వేలు, రూ.20 వేలు, రూ.10వేలు అందజేయనున్నట్లు చెప్పారు. వివరాలకు సెల్: 9652463044, 9491164104 నంబరులో సంప్రదించాలని కోరారు.

వేడుకగా సామూహిక వివాహాలు



హొళగుందలో వెలిసిన సోమేశ్వరస్వామి, సామూహిక వివాహాలు జరుగుతున్న దృశ్యం

హొళగుంద: మండల కేంద్రంలోని ఈరన్న బావి వద్ద వెలిసిన సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శివస్వాముల ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు జరిగాయి. శివమాలధారులు, స్థానిక భక్తులు, గ్రామస్తుల సహకారంతో జరిగిన సామూహిక వివాహ మహోత్సవానికి వధూవరుల బంధువులు, కటుంబ సభ్యులతో పాటు గ్రామపెద్దలు, రాజకీయ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మొత్తం నాలుగు జంటలు ఒకటయ్యాయి. అలాగే కోగలతోట గ్రామంలోని హగరి బసప్ప ఆలయంలో కూడా సామూహిక వివాహాలు జరిగాయి.

చెత్త నుంచి సంపద తయారీయే లక్ష్యం

పత్తికొండ రూరల్ : చెత్త నుంచి సంపద తయారీయే లక్ష్యమని డీఎల్‌పీఓ వీరభద్రుడు, పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీ ఈఓ నరసింహులు అన్నారు. ఆదివారం పత్తికొండలోని ప్రధాన రోడ్డులో షాపుల నుంచి తడి, పొడి చెత్తను సేకరించారు. వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని కోరారు. తడి చెత్తను చెత్త సంపద కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు విక్రయిస్తామన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ, ఈఓ

26న భజన పోటీలు

కృష్ణగిరి: చుంచుఎర్రగుడి గ్రామంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 26వ తేదీన జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గెలుపొందిన వారికి దాతల సహకారంతో వరుసగా రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు , రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.1,016 అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్ 9492844349, 9100306631 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

26న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు..

ఈ నెల 26న రాష్ట్రస్థాయి హోమ్ టీమ్స్ పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10 వేలు, రూ.5వేలు అందించనున్నారు. సెల్ 8309741106, 9493322482 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రాలు

- 30 ఏళ్ల క్రితం నిర్మించిన 15 కేంద్రాలు

ఆలూరు రూరల్: ఆలూరు ఐసీడీఎస్ క్లస్టర్ పరిధిలోని పలు అంగన్‌వాడీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. 30 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. క్లస్టర్ పరిధిలో 1995లో నిర్మించిన 15 కేంద్రాలు ఉన్నట్లు ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. చిప్పగిరి మండలం నగరడోణ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్-1లో 25 మంది 0-6 వయసు పిల్లలు చదువుతున్నారు. కొన్ని రోజులుగా పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ఉన్న సమయంలో పెచ్చూలిడిపడితే ప్రమాదం చోటు చేసుకునే అవకాశముందని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించిన భవనాలు మార్చాలని, లేదా వాటికి మరమ్మతులు చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



నగరడోణలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రం



ప్రమాదకరంగా నగరదోణ అంగన్‌వాడీ భవనం పైకప్పు

నేడు పీఎం కిసాన్ నిధుల విడుదల

తుగ్గలి : ప్రధానమంత్రి కిసాన్ పథకం మూడవ విడత నిధులు కేంద్రం సోమవారం విడుదల చేయనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిధులను విడదల చేయనున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికే రెండు విడతల్లో సాయం అందించిన కేంద్రం ఇప్పుడు మూడవ సాయం జమ చేయనుంది. మండల వ్యాప్తంగా 16,435 మంది రైతుల ఖాతాల్లోకి రూ.3.28 కోట్లు జమ కానున్నాయని వ్యవసాయ శాఖ మండల అధికారి పవన్‌కుమార్ తెలిపారు.

బైక్ చోరీ

వెల్దుర్తి: పట్టణంలోని ఇందిరాగాంధీ నగర్ నివాసి ఇలియాస్‌కు చెందిన బైక్ స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో చోరీకి గురైంది. ప్రతిరోజు ఉద్యోగం నిమిత్తం కర్నూలుకు వెల్దుర్తి నుంచి రైలులో వెళ్లేటప్పుడు తన స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను వెల్దుర్తి రైల్వేస్టేషన్ ఆవరణలో పార్క్ చేసేవాడు. శనివారం ఉదయం బైక్ పార్క్ చేసి కర్నూలు వెళ్లి తిరిగి సాయంత్రం 7గంటల సమయంలో తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. చోరీకి గురైనట్లు నిర్ధారించుకుని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బంకు దగ్ధం

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో బోయ కామాక్షమ్మ అనే మహిళకు చెందిన బీడి బంకు ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ స ర్క్యూట్‌తో కాలిపోయింది. ప్రమాదంలో దా దాపు రూ.50 వేలు విలువజేసే సరుకులు కాలిపోయినట్లు బాధితులు వాపోయారు. బంకులో ఉన్నట్టుండి మంటలు వ్యాపించడంతో స్థానికులు మంటలు ఆర్పేలోపు అప్పటికే చాలా వరకు సరుకులు కాలిపోయాయని తెలిపారు.

ఆర్థిక సాయం

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో ఈనెల 20న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమై నష్టపోయిన బాధితుడు ఉచ్చీరప్ప కుటుంబానికి ఆదివారం ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి సోదరుడు బుసినె వెంకటేష్ రూ. 10వేలు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతరెడ్డి రూ.5వేలు విలువజేసే సరుకులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పెద్దయ్య, మండల కార్యదర్శి బసవరాజు పాల్గొన్నారు.

నేడు ప్రజల అర్జీల స్వీకరణ

ఆలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజల అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గోవింద్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ బసన్నగౌడు ఆదివారం తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు,రైతులు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశానికి వివిధ మండలాలకు చెందిన వీఆర్వోలు, కార్యాలయ తప్పనిసరిగా హాజరు కావాలని ఆర్ఐ పేర్కొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఆలూరు: కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వీడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం దేవనకొండ మండలం అలారుదిన్నె గ్రామంలో పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూ టమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందుకు రైతులు, నిరుద్యోగులు, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చవేర్చడంతో ప్రభుత్వం విఫలమైయిందన్నారు. ప్రస్తుతం టమాట,మిర్చి,శనగ పంట ఉత్పత్తులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించలేకపోయిందన్నారు. అంతకు ముందు యాటకల్లు గ్రామ సర్పంచ్ కదిరి సుధమ్మ, పెద్దిరెడ్డి దంపతులపై దాడికి పాల్పడటం దారుణమన్నారు. అనంతరం బిల్లేకల్లు గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పెద్దయ్య గృహప్రవేశంలో పాల్గొన్నారు. నారాయణరెడ్డి, అలిగేర గ్రామ నాయకుడు వెంకటరెడ్డి, దేవనకొండ మండలం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అరుణకుమార్,పుట్టకలమర్రి గ్రామ సర్పంచ్ శివారెడ్డి,శేషాద్రిరెడ్డి, మనోహర్‌రెడ్డి,సురేష్ ఉన్నారు.



మాట్లాడుతున్న తెర్నెకల్ సురేంద్రరెడ్డి

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

దేవనకొండ: మండలంలోని ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు అందించి, ఉద్యోగభద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.రమీజాబీ, జిల్లా నాయకులు ఎం.నరసారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా జనరల్ బాడీ సమావేశం ఆశా యూనియన్ జిల్లా నాయకురాలు డి.రాధ అధ్యక్షతన నిర్వహించారు. ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఆశా యూనియన్ నాయకులు తులసమ్మ, రాధిక, రాధ, నాగవేణి, అరుణ, సువర్ణ, నాగలక్ష్మి, హైమావతి పాల్గొన్నారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దరఖాస్తు చేసుకోండి

మద్దికెర : 2019 సంవత్సరానికి ముందు ప్రభుత్వ స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేసుకున్న వారికి జీవో 30 ఆధారంగా ప్రభుత్వం పట్టా మంజూరు చేస్తామని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ ఆదివారం తెలిపారు. లబ్ధిదారులు సమీపంలోని సచివాలయాలలో మార్చి 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెత్త నిర్వహణపై అవగాహన

వెల్దుర్తి: పుల్లగుమ్మి గ్రామంలో పంచాయతీ కార్మికులకు అప్పగించాల్సిన చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం ఈఓఆర్డీ రవికిశోర్, డీపీఆర్‌సీ కృష్ణారెడ్డి, సెక్రటరీ రహమత్‌బాషా, నాయకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వీధుల్లో తిరుగుతూ ఇళ్లలోని చెత్తను అందించే విధానాన్ని తెలిపారు. చెత్తను గ్రామ సమీపంలోని చెత్త సంపద కేంద్రానికి తరలిస్తామని అధికారులు చెప్పారు.

శ్రీశైలం బయలుదేరిన శివ మాలధారులు

హొళగుంద: మండల గజ్జహళ్లిలో గ్రామంలో శివ మాలధారులు ఆదివారం ఇరుముడితో శ్రీశైలం బయలుదేరారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయంలో శివస్వాములు గురుస్వామి సురేష్ శాస్త్రి ఆధ్వర్యంలో ఇరుముడ్డి స్వీకరించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలానికి బయలుదేరుతున్న సందర్భంగా ఆలయంలో జలాభిషేకలు, ఆకుపూజా, మహామంగళ హారతి, నైవేద్య సంతర్పణ తదితర కార్యక్రమాలనంతరం ఇరుముడి స్వీకరించారు. మాలధారులకు వీడ్కోలు పలికేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున తరలి వచ్చి సాగనంపారు.



గజ్జహళ్లిలో ఇరుముడితో శ్రీశైలానికి వెళ్తున్న శివస్వాములు

కర్రలే విద్యుత్ స్తంభాలు!



కర్రలు పాతి తీగలు లాగిన దృశ్యం

ఆలూరు: విద్యుత్ శాఖలో నిర్లక్ష్యం వేళ్లూనుకుపోయింది. ఏళ్లు గడుస్తున్నా విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయకుండా సాగదీత ధోరణిని అవలంభిస్తున్నారు. ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో జేఎల్ఎంలు, ఎల్ఐలు, ఏఈలు ,బిల్ కలెక్టర్లు, పోల్‌టూ ,పోల్, ఆపరేటర్లు ఇలా దాదాపు 11 విద్యుత్ సబ్ స్టేషన్లలో 50 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీరు గ్రామ స్థాయిలో ప్రైవేటు సిబ్బందని నియమించుకుని విద్యుత్ సమస్యలు పట్టించుకోకుండా కాలయాపనచేస్తున్నారని చెప్పడాని ఈ ఘటనే ఉదాహరణ. మండలంలోని మరకట్టు గ్రామంలో ఓ రైతు బోరు తవ్వించుకున్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం స్తంభాలకు సంబంధించి అంచనాలు రూపొందించి, విద్యుత్ తీగలు లాగాల్సి ఉంది. అయితే ఏడేళ్లు గడిచినా నేటి వరకు అలాంటివేవీ చేపట్టలేదు. సదరు రైతులు పలు మార్లు వారిని వేడుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో కొన్ని ఊత కర్రలను స్తంభాలుగా నాటి తీగలు లాగి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకున్నారు. కర్రలను పొలాల గట్లపై నాటడంతో ప్రస్తుతం అవన్నీ ఒరిగిపోయాయి. ఎప్పుడేం జరుగుతుందోనని సమీప పొలాల రైతులు, కూలీలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనదారులు అటు వైపు వెళ్లడానికి జంకుతున్నారు. కర్రలను స్తంభాలుగా మార్చుకున్న పరిస్థితిని ఏఈ గుర్రప్ప దృష్టికి తీసుకెళ్లగా తాను పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారు.



కోయిలకొండ- చిట్యాల గ్రామాల మధ్య విద్యుత్ లైన్ కోసం చెట్లను నరికేసిన దృశ్యం

పచ్చదనం మాయం

కోయిలకొండ- చిట్యాల గ్రామాల మధ్య రహదారులకు ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు చెట్లుగా మారి పచ్చగా కళకళతుండేవి. అయితే ఆర్‌డీఎస్ పథకం కింద గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించడంలో భాగంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేసే క్రమంలో పెరిగిన చెట్లను తొలగిస్తున్నారు. పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అధికారులు చెట్లను కొట్టివేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై అధికారులను ప్రశ్నించగా.. పొలాల్లో రైతులు విద్యుత్ లైన్‌ను అనుమతించకపోవడంతో రోడ్డు పక్కన వేయాల్సి వస్తుండటంతో చెట్లను కొట్టివేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

– కృష్ణగిరి